క్లుప్తంగా

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



రంగవల్లుల పోటీల్లో మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్, కేబీఎన్ యూజీసీ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యాన కేబీఎన్ కళాశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని, గ్రామీణ జీవితాలతో ఈ పండుగ ఎంతో అనుబంధాన్ని పెనవేసుకుందన్నారు. సరదాలు, సందడితో పాటు గొప్పదైన ఖగోళ విజ్ఞానం కూడా సంక్రాంతి పండుగలో దాగుందన్నారు. కమిటీ సభ్యులు బీవీ బాలకోటేశ్వరరావు పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పురావూరి రజిని, సాధు దుర్గాదేవి, ప్రధాన కార్యదర్శి టి. చంద్రశేఖర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎం. శారద ముగ్గులు, గాలిపటాల పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ పాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న వివేక్‌దత్తాత్రేయ పట్కీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వివేక్ దత్తాత్రేయ పట్కీ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజిమెంట్ స్టడీస్, ఫోరమ్ ఆఫ్ ఫ్రీ ఎంటర్‌ప్రైజ్, ఎంఆర్‌పై ఫౌండేషన్ (ముంబై) ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగిన నాయకత్వ లక్షణాల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. తొలుత వివేక్ దత్తాత్రేయ పట్కీ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో అనేక రంగాల్లో విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యూహాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన మానవ వనరుల నిర్వహణ, తమ నాయకత్వ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని తెలుసు అనే భావనను విడిచి తెలుసుకోవాలనే ఉత్సాహకతతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ వి.విజయదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం



గంగాళాలతో స్వామి వారికి నివేదన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కూడారై ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కళ్యాణ మండపంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు పూజలు నిర్వహించి 108 గంగాళాలతో ప్రసాదాన్ని నివేదనగా సమర్పించారు. కార్యక్రమానికి దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు భక్తులు, ఉభయదాతలు హాజరయ్యారు. సాయంత్రం స్వామి వారికి పంచ హారతుల సేవ, ఏకాంత సేవలను నిర్వహించారు.

స్వర మాంత్రికుడు కేజే జేసుదాసు



గాయకుడు చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న డేవిడ్‌రాజు, చిట్టిబాబు తదితరులు

విజయవాడకల్చరల్: స్వర మాంత్రికుడు కేజే జేసుదాసు అని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత విద్వాంసుడు జేసుదాస్ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డేవిడ్ రాజు మాట్లాడుతూ.. స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గాయకుడు జేసుదాసు అని అభివర్ణించారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దండు చంద్రశేఖర్ సంస్థ లక్ష్యాలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ జేసుదాసు దాదాపు అన్ని భారతీయ భాషల్లో పాటలు పాడారన్నారు. సుశీల్‌కుమార్, భారతి ఆదిరాల జయప్రభ తదితరులు చిత్రగీతాలను ఆలపించారు. అతిథులు చంద్రశేఖర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్నకు నివాళులర్పిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్థవంతంగా నడిపించిన నాయకుడు వడ్డే ఓబన్న అని వీఎంసీ అధనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం వద్ద వడ్డే ఓబన్నకు శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు వడ్డే ఓబన్నని తెలిపారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాంటి మహనీయులని గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

భవానీపురం(విజయవాడ పశ్చిమ):విద్యాధరపురం సితార జంక్షన్ సమీపంలోని లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాశ్మీర్ జలకన్య ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కాశ్మీర్ అందాలతోపాటు జలకన్యల అద్భుత విన్యాసాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం మాట్లాడుతూ అందరినీ ఆకట్టుకుని ఆహ్లాదపరచే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. నిర్వాహకులు రాజారెడ్డి, కోటిరెడ్డి, షన్ను ఖాన్, అడపా ప్రభాకర్ మాట్లాడుతూ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసే కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్ చిన్నారులు, పెద్దలకు ఆనందాన్ని అందిస్తుందని తెలిపారు. జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డాన్స్, చిన్న పిల్లల ఆట వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు.

ఉత్సాహంగా బీఎన్‌కేయూ చెస్ రేటింగ్ టోర్నీ





చెస్ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు, వెంకట కృష్ణకార్తీక్‌ను సన్మానిస్తున్న బీఎన్‌కేయూ ప్రతినిధులు

ముందంజలో తెలంగాణ క్రీడాకారుడు సమరతేజ

విజయవాడస్పోర్ట్స్: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్(బీఎన్‌కేయూ) ఫౌండేషన్ రెండో అంతర్జాతీయ 1800 లోపు చెస్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ రెండో రోజు శనివారం ఉత్సాహభరితంగా సాగింది. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సౌజన్యంతో పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో 425 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. రెండో రోజు పోటీలను ఐకాన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొండిశెట్టి రాజేంద్ర, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ ప్రారంభించారు. రెండో రోజు సాయంత్రానికి ఆరు రౌండ్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ క్రీడాకారుడు సమరతేజ 6/6 పాయింట్ల ఆధిక్యంతో ముందంజలో కొనసాగుతున్నాడని టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీం, డైరెక్టర్ సలపల భీమారావు, బీఎన్‌కేయూ కార్యదర్శి విత్తనాల కుమార్, ఉపాధ్యక్షులు అమ్మిన ఉదయకుమార్‌నాయుడు, కోశాధికారి నరేష్ తెలిపారు. పోటీల్లో భాగంగా ఇటీవల కిరిస్తాన్‌లో జరిగిన ఏషియన్ డిజేబుల్డ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి సాధించి, ప్రపంచ డిజేబుల్డ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన క్రీడాకారుడు వెంకటకృష్ణకార్తీక్‌ను ఫౌండేషన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

పుస్తక మహోత్సవాన్ని సందర్శించిన డెప్యూటీ సీఎం



పుస్తక మహోత్సవంలో పవన్‌కల్యాణ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం ఉదయం సందర్శించారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ పుస్తక మహోత్సవం కొనసాగుతుంది. అయితే పవన్‌కల్యాణ్ కోసం ఉదయం ప్రత్యేకంగా పుస్తక మహోత్సవానికి స్టాల్స్ యజమానులను పిలిపించారు. పవన్‌కల్యాణ్ చట్టాలు, చరిత్ర, రాజకీయ, పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష సంబంధిత పుస్తకాలపై ప్రత్యేక ఆసక్తి చూపించారు. అలాగే తెలుగు సాహిత్యం, అనువాద సాహిత్యం, నిఘంటువులు, పరిశీలన చేశారు. ప్రత్యేకంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు కొనుగోలు చేశారు. సుమారు గంటలన్నర సేపు వరకూ ఆయన పుస్తక మహోత్సవంలో స్టాల్స్‌ను సందర్శించారు. పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మయ్య, టి.మనోహర్‌నాయుడు, ఎమెస్కో అధినేత డి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నటరాజస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



నటరాజస్వామి వారికి మంగళస్నానాలు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో శ్రీశివకామ సుందరీ సమేత నటరాజస్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్వామి వారి ఆలయంలో ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు, వధూవరులుగా అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉపాలయమైన నటరాజ స్వామి వారి ఆలయంలో తొలుత గణపతి పూజ చేశారు. అమ్మవారి ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, కోట రవి, ఏఈవో దుర్గారావులతో పాటు ఆలయ అధికారులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, అధికారులు గణపతి పూజను నిర్వహించగా, ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు జరిపించారు. తొలుత పంచామృత అభిషేకాలు వివిధ సుగంధ ద్రవ్యాల జలాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ నిర్వహించి సర్వ దేవతలను స్వామి వారి కల్యాణోత్సవానికి ఆహ్వానించారు.

నేడు స్వామి వారి కల్యాణోత్సవం...

ఆదివారం సాయంత్రం 7 గంటలకు నటరాజ స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ నటరాజ స్వామి వారికి అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహిస్తామని, తెల్లవారుజామున 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని పేర్కొంది.

17న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ (ఎస్ఆర్) నియామకాల కోసం ఈ నెల 17న వాక్ –ఇన్ –ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

వర్తక, వాణిజ్య హబ్‌గా పశ్చిమ నియోజకవర్గం



భవానీపురంలోని పున్నమి హోటల్



వాణిజ్య కూడలిగా భవానీపురం స్వాతీ రోడ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాలలో పశ్చిమ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇంద్రకీలాద్రిపై ఆదిపరాశక్తి శ్రీకనకదుర్గమ్మ కొలువై ఉండటంతో నియోజకవర్గానికి ప్రాధాన్యత సంతరించుకుంది. విద్య, వైద్యం, వర్తక, వాణిజ్య హబ్‌గా తయారుకావడంతో జిల్లాలోని ప్రజలతోపాటు చిరు వ్యాపారులు నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తుండటంతో నిత్య కల్యాణం.. పచ్చతోరణంలా కళకళలాడుతుంది. ముఖ్యంగా వస్త్ర వ్యాపారంతోపాటు జ్యువెలరీ షాపులు కూడా ఇక్కడ ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. గట్టు వెనుక ప్రాంతంగా పిలువబడే భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాలు, నగరంలో నిత్యం రద్దీగా ఉండే గవర్నర్‌పేట బీసెంట్ రోడ్‌ను తలపిస్తున్నాయి. ఒక వైపు 65వ నెంబర్ జాతీయ రహదారి, మరో వైపు గొల్లపూడి బైపాస్ రహదారితో పశ్చిమ నియోజకవర్గం వర్తక, వాణిజ్య హబ్‌గా తయారయ్యింది.

ఆధునిక వైద్య సదుపాయాలు



భవానీపురం స్వాతి రోడ్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనంలో బాలాజీ హాస్పటల్స్ అండ్ డయాబెటిస్ సెంటర్‌లో అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాం. సుశిక్షితులైన వైద్య సిబ్బందితో 50 పడకలతో హాస్పటల్‌ను రూపొందించాం.

– డాక్టర్ ఆర్ఎల్‌వి ఫణికుమార్, డయాబెటిక్ వైద్య నిపుణులు

చిన్నారుల మెదడుకు పదును



అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సిప్ అబాకస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ బ్రాంచిలను వన్‌టౌన్, భవానీపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఎంతో మంది సాధారణ విద్యార్థులను 5 రెట్లకుపైగా మెరుగైన ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాం.

– జీవీడీ మధుసూధనరావు, సిప్ అబాకస్ సెంటర్ హెడ్.

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది



భూమి, స్థలం, అపార్ట్‌మెంట్స్, భవనాలు అమ్మకం.. కొనుగోళ్లు ఉన్నప్పుడే రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంటుంది. కోవిడ్ రెండేళ్ల కాలంలో అతలాకుతలమైపోయిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడిప్పుడే తిరిగి పుంజుకుంటుంది.

– ఎం. శ్రీనివాసరావు, (ఎమ్ఎస్ఆర్ డెవలపర్స్).

విద్యలవాడగా విజయవాడకు సుస్థిర స్థానం



విద్యలవాడగా పేరొందిన విజయవాడ నగరానికి ఒక సుస్థిర స్థానం ఉంది. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎందరో మహానుభావులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు.

– లయన్ ఎన్ సూర్యారావు, డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్. గౌతమ్ విద్యా సంస్థలు.

నవీన నిర్మాణాలలో ఎలక్ట్రానిక్స్‌కే ప్రాధాన్యం



ఆధునిక కాలంలో సంపన్నులు సకల హంగులతో నిర్మించుకుంటున్న నవీన భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలలో ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. లగ్జరీగా జీవించాలని భావించే ప్రతి ఒక్కరూ క్వాలిటీగల ఎలక్ట్రానిక్ ఐటిమ్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. – ఆర్.నాగేంద్ర బాబు, పద్మజ అసోసియేట్స్.

దంతాలు ఆరోగ్యవంతంగా చూసుకోవాలి



రుచుల పేరుతో ఏదిపడితే అది తినేస్తే దంతాలు దెబ్బతింటాయి. అలాగే ధూమపానం, గుట్కా వంటివాటికి అలవాటు పడితే పంటిపై ఉండే ఎనామిల్ దెబ్బతిని గార పట్టేసి చూసేందుకు అసహ్యంగా కనిపిస్తాయి. అందుకే ప్రతి ఒక్కరూ దంతాల పట్ల శ్రద్ధ తీసుకోవాలి.

– డాక్టర్ సీఎల్‌వీ కిరణ్ కుమార్